సాక్షి
నిజామాబాద్
గురువారం ; 29 ; ఫిబ్రవరి ; 2024



రేపు బాబ్లీ గేట్ల ఎత్తివేత

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు శుక్రవారం ఎత్తనున్నారు.

- 10లో ▸



పనుల్లో నిర్లక్ష్యం తగదు

గుత్ప ఎత్తిపోతల పనుల్లో నిర్లక్ష్యం తగదని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధికారులకు సూచించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.6 /21.6

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

నాలుగేళ్లకోసారి పండుగ!



- వీళ్ల బర్త్‌డే, మ్యారేజ్‌డే వెరీ స్పెషల్
- ఫిబ్రవరి 29న జన్మించిన, పెళ్లి చేసుకున్న వారి మనోగతం
- 'ప్రత్యేక రోజు' వేడుకలకు సిద్ధం

పుట్టిన రోజు.. పెళ్లి రోజు ప్రతి మనిషి జీవితంలో మరిచిపోలేనివి. ఆ రోజును ప్రతి ఏటా ఘనంగా జరుపుకోవాలనుకుంటారు.. కానీ వీరు మాత్రం తమ బర్త్ డే, మ్యారేజ్ డేలను నాలుగేళ్లకోసారి జరుపుకుంటారు. లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29న తమ జన్మదినం, వివాహ వార్షికోత్సవాలు ఉండటమే అందుకు కారణం.. ఆ రోజు కోసం నాలుగేళ్లు నిరీక్షించి పండుగలా చేసుకుంటామని వారు చెబుతున్నారు. నేడు ఫిబ్రవరి 29 సందర్భంగా ప్రత్యేక కథనం..

అరుదైన రోజు ఏకమయ్యారు

పెర్కిట్: పెర్కిట్‌కు చెందిన రాస ప్రసాద్, స్వర్ణలత దంపతులు 2012 ఫిబ్రవరి 29న పెళ్లి చేసుకున్నారు. వీరికి వినేష్ సాయి, మోక్షిత్ సాయి అనే ఇద్దరు కుమారులున్నారు. అరుదైన రోజు వివాహం చేసుకున్న ఈ దంపతులు తమ మూడో వివాహ వార్షికోత్సవం పెర్కిట్ శివాలయంలో జరుపుకోనున్నారు.



పెర్కిట్‌కు చెందిన స్వర్ణలత ప్రసాద్ దంపతులు

ఘనంగా వేడుకలు



ఆర్మూర్‌కు చెందిన నారాయణ, శకుంతల కుమారుడు కుబీర్ శివానంద్ 1984 ఫిబ్రవరి 29న జన్మించాడు. 40 ఏళ్ల వయసు వచ్చినా ఇతను తొమ్మిది పర్యాయాలు మాత్రమే జన్మదినాన్ని జరుపుకున్నాడు. తన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి నేడు జన్మదినాన్ని ఘనంగా జరుపుకోవడానికి చేసుకుంటున్నాడు.

ప్రత్యేకమే అయినా..



సుభాష్‌నగర్: నగరంలోని న్యూ ఎన్జీవోస్ కాలనీలో నివాసముండే సరళాదేవి కార్తీక్‌రెడ్డి దంపతుల కుమార్తె సాయిస్నిగ్ధ 2012 ఫిబ్రవరి 29న జన్మించింది. పుట్టి 12 ఏళ్లు అవుతున్నా ఆమె నేడు మూడో పుట్టిన రోజే జరుపుకోనుంది. ఈ తేదీ ప్రత్యేకమైనప్పటికీ.. అందరిలా ప్రతి ఏడాది జరుపుకునే అవకాశం లేదు. సాయిస్నిగ్ధ ప్రస్తుతం ఏడో తరగతి చదువుతోంది.

ఆ రోజు మా కోసమే..



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లికి చెందిన సుంకరి మేఘన, మోర్తాడ్‌కు చెందిన లోలం ప్రవీణ్ వివాహం గురువారం(నేడు) జరగనుంది. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ లీపు సంవత్సరంలో ఒక రోజు తమ కోసమే ఉందని వారు అంటున్నారు. 29న పురోహితులు ముహూర్తం నిర్ణయించారని, ఈ రోజు కాకుండా వేరే చూడాలని కోరినప్పటికీ ముహూర్తం బలంగా ఉందని చెప్పడంతో పెళ్లికి ఓకే చెప్పామన్నారు. నాలుగేళ్లకోసారి వచ్చే ఈ ప్రత్యేక రోజును నాలుగింతల సంబురంగా చేసుకుంటామని తెలిపారు.

సమ్‌థింగ్ స్పెషల్



కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌కు చెందిన దాశలత, మోర్తాడ్‌కు చెందిన మర్రి అజయ్‌కుమార్ జంట నేడు(గురువారం) వివాహంతో ఒకటి కాబోతోంది. ఫిబ్రవరి 29న వివాహం చేసుకోవడం ప్రత్యేకంగా అనిపిస్తోందని ఈ జంట చెబుతోంది. అందరికి ఏడాదికోసారి వచ్చే వార్షికోత్సవం తమకు నాలుగేళ్లకోసారి వస్తోందని.. పెళ్లి రోజు సమ్‌థింగ్ స్పెషల్ డే అంటున్నారు. పురోహితులు ముహూర్తం ఖరారు చేసినప్పుడు ఇదేరోజు ఇద్దరికి బలం ఉందని చెప్పారు. ప్రత్యేక రోజు కావడంతో ఓకే చెప్పామన్నారు.

న్యూస్‌రీల్

నేడు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రాక



సుభాష్‌నగర్: కొమురంభీం క్లస్టర్ విజయ సంకల్ప బస్సుయాత్ర ముగింపు సందర్భంగా నగరంలోని పాత కలెక్టరేట్ మైదానంలో గురువారం జరిగే బహిరంగ సభకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, జాతీయ కార్యవర్గసభ్యుడు ఈటల రాజేందర్ హాజరుకానున్నారు. 'దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం' అనే నినాదంతో సభను నిర్వహిస్తున్నారు. భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. సభకు బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి, జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి కోరారు. ఎమ్మెల్యే వెంట నాయకులు, కార్పొరేటర్లు నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేష్‌యాదవ్, గంగోనే గంగాధర్, ఎర్రం సుధీర్, పంచరెడ్డి శ్రీధర్, ప్రభాకర్, బాలకృష్ణ, నారాయణ యాదవ్ ఉన్నారు.

ఢిల్లీ రైతు దీక్షలకు సంఘీభావం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఢిల్లీలో ఆందోళనలు, దీక్షలు చేస్తున్న రైతులకు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం హైదరాబాద్‌లో ఎల్‌బీ స్టేడియం నుంచి ఇందిరా పార్క్ వరకు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో జిల్లా నుంచి కిసాన్ సెల్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి ఆధ్వర్యంలో అన్ని మండలాల రైతు నాయకులు తరలివెళ్లారు. కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డితో పాటు రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్డీవోలు బదిలీ

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఇద్దరు ఆర్డీవోలు(రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్లు)బదిలీ అయ్యారు. బోధన్ ఆర్డీవో బురుగు రాజాగౌడ్‌ను ఆర్మూర్ ఆర్డీవోగా, ఆర్మూర్ ఆర్డీవో వినోద్‌కుమార్‌ను భూపాలపల్లి జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ)గా ప్రభుత్వం స్థానచలనం కల్పించింది. మంచిర్యాల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎల్‌ఏ)గా ఉన్న సిద్ధం దత్తు బోధన్ ఆర్డీవోగా బదిలీపై రానున్నారు.

తవ్వినకొద్దీ..!

- బయటపడుతున్న గత డీసీవో సింహాచలం అక్రమాలు
- రియల్ ఎస్టేట్ కంపెనీకి సైతం ఖాతాల నుంచి చెల్లింపులు
- నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేట్ ఫర్టిలైజర్ కంపెనీలతో వ్యాపారం
- చెక్కులతో లావాదేవీలు చేయాల్సి ఉన్నా భారీగా నగదు విత్‌డ్రా
- సొసైటీలకు వచ్చిన కమీషన్లలోనూ వాటాలు దండుకున్న వైనం
- బైకులపై వందల క్వింటాళ్ల ధాన్యం రవాణా చేసినట్లు పొంతన లేని లెక్కలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: జిల్లా సహకార అధికారిగా సుమారు ఎనిమిదేళ్ల పాటు పనిచేసిన సింహాచలం అక్రమాలు తవ్వినకొద్దీ బయటపడుతున్నాయి. గత ప్రభుత్వంలో కొందరు కీలక ప్రజాప్రతినిధుల అండతో ఇష్టం వచ్చినట్లు రెచ్చిపోయిన ఆయన.. అడ్డూఅదుపూ లేకుండా వ్యవహరించిన అంశాలు వరుసగా వెలుగులోకి వస్తున్నాయి.

జిల్లా సహకార అధికారి బ్యాంకు ఖాతా ద్వారా ఇష్టం వచ్చినట్లు చెల్లింపులు చేశారు. 2022 జూలై 26న ప్రీమియర్ రియల్ ఎస్టేట్ కంపెనీకి రూ. 1,61,595 నగదు చెల్లింపు చేశారు. అదేవిధంగా రూ. 25 వేలకు మించి చేసే లావాదేవీలను చెక్కు ద్వారానే చేయాల్సి ఉన్నా రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల మేర అనేకసార్లు నగదు విత్‌డ్రా చేయడం గమనార్హం. పైగా మార్కెఫెడ్, నేరుగా కంపెనీల నుంచి మాత్రమే కొనుగోళ్లు చేయాల్సి ఉన్నా ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోళ్లు చేసి భారీగా చెల్లింపులు చేయడం పరిస్థితికి అద్దం పడుతోంది.

- సింహాచలంకు అసిస్టెంట్‌గా ఉన్న బి.రాజేశ్వర్ ఖాతా నుంచి సైతం భారీగా లావాదేవీలు చేయడం విశేషం. రాజేశ్వర్ ఖాతా నుంచి ఏకంగా రూ. 22,86,000 నగదు డ్రా చేయడం గమనార్హం. మాక్లూర్ సహకార సంఘంలో రూ. 5 లక్షల గోల్డ్ లోన్ తీసుకున్న సింహాచలం పది రోజుల తర్వాత రాజేశ్వర్‌ను పంపించి, పెళ్లి ఉందని.. బంగారం తిరిగి తెచ్చి స్తామని తీసుకెళ్లాడు. అప్పు చెల్లించకుండా బంగారం తీసుకెళ్లి ఏడాది తర్వాత అసలు మాత్రమే చెల్లించినట్లు తెలుస్తోంది. వడ్డీ మాత్రం చెల్లించలేదు. పైగా ఈ బంగారాన్ని డొంకేశ్వర్ సొసైటీలో పెట్టి రుణం తీసుకున్నట్లు తెలుస్తోంది.
- మాక్లూర్ సహకార సంఘానికి చెల్లించాల్సిన రవాణా చార్జీ 12 నుంచి 18 నెలల తరువాత చెక్కు ద్వారా చెల్లించడం జరిగింది. ధాన్యం రవాణాకు సంబంధించి బాధ్యత పౌరసరఫరాల శాఖది. సహకార సంఘం చెల్లించకూడదు. ఇలాంటివి గత ఐదేళ్ల లావాదేవీలను పరిశీలిస్తే అన్ని సొసైటీల నుంచి ధాన్యం రవాణాకు చెల్లింపుల విషయంలో సింహాచలం అవినీతి ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందని పలువురు రైతులు చెబుతున్నారు.
- ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి పౌరసరఫరాల శాఖ నుంచి వచ్చిన కమీషన్‌ను వెంటనే సొసైటీలకు చెల్లించాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా నెలల తరబడి ఖాతాలో ఉంచి వచ్చిన వడ్డీని దుర్వినియోగం చేశారు. కమీషన్‌లో 2శాతం వసూలు చేసి ఆ డబ్బును దండుకున్నాడు.
- ఎత్తొండ సొసైటీకి సరిపడా నిల్వలు లేకున్నా నిజామాబాద్ డీసీసీబీ నుంచి రూ. 2.05 కోట్లు రుణం ఇప్పించాడు. రూ. 4 కోట్ల నిల్వలు ఉంటేనే ఇవ్వాల్సిన ఈ రుణాన్ని కేవలం రూ. 1.30 కోట్లు ఉన్నప్పటికీ ఇప్పించడం గమనార్హం.

- 2020లో ఎత్తొండ సొసైటీలో ఎన్నికలకు సంబంధించి అర్హత ఉన్న 100 మందిని అనర్హులుగా నిర్ణయిస్తూ ఓటర్ లిస్టు తయారు చేశాడు. సహకార సంఘం పరిధిలోని గ్రామాలను క్లాక్ వైజ్ విభజించాల్సి ఉన్నప్పటికీ, అదేవిధంగా గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాల్సి ఉన్నా రెండుగా విభజించి వార్డులను చట్ట విరుద్ధంగా నిర్ణయించారు.
- ఇక సింహాచలంపై వచ్చిన ఆరోపణలకు ఆయననే విచారణాధికారిగా ఉన్నతాధికారులు నియమించడంతో అక్రమాలన్నీ మరుగునపడ్డాయి.
- కొనుగోలు కేంద్రం ఫ్లెక్సీలకు సంబంధించి ఒక్కో సొసైటీ నుంచి పది రెట్లు అదనంగా వసూలు చేశాడు.
- ఎత్తొండ సహకార సంఘం పరిధిలో ద్విచక్ర వాహనంపై వందల క్వింటాళ్ల ధాన్యం రవాణా చేసినట్లు చూపించడం పరిస్థితికి అద్దం పడుతోంది. అదేవిధంగా ఈ సొసైటీలో ఒక లారీ 20 ట్రిప్పుల ధాన్యాన్ని రవాణా చేసినట్లు చూపించారు. ఒక సీజన్‌లో 20 ట్రిప్పులు వేసే అవకాశం ఉండదు. సొసైటీలకు వచ్చిన కమీషన్‌కు సంబంధించి భారీగా పర్సంటేజీలు దండుకున్నట్లు తెలుస్తోంది.

ఇంటర్ పరీక్షలు షురూ..

- మొదటి రోజు 795 మంది విద్యార్థులు గైర్హాజరు
- ఒకరిపై మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు
- ఆలస్యంగా వచ్చిన ఇద్దరిని అనుమతించని అధికారులు



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో రఘురాజ్

నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్ష రాశారు. జిల్లాలో మొత్తం 57 కేంద్రాల్లో పరీక్షలు 40కిపైగా కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. డీఐఈవో నిజామాబాద్‌లోని తొమ్మిది సెంటర్లను పరిశీలించారు. హైపవర్ కమిటీ ఆరు కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్ 8, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 20 కేంద్రాలను తనిఖీ చేశారు. నవీపేట మోడల్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థిపై మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైనట్లు డీఐఈవో రఘురాజ్ తెలిపారు. మొత్తం 19,117 మంది విద్యార్థులకు గాను 795 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా 18,322 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. వీరిలో జనరల్ 16,717 మంది విద్యార్థులకు గాను 609 మంది విద్యార్థులు హాజరుకాలేదు. కాగా 16,108 మంది విద్యార్థులు హాజరయ్యారు. అలాగే ఒకేషనల్ 2,400 మంది విద్యార్థులకు గాను 186 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 2,214 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. నగరంలోని కంఠేశ్వర్‌లో గల ఎస్ఆర్ కళాశాలలో ఆలస్యంగా వచ్చిన ఇద్దరు విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. నేడు ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

రేపటి నుంచి జీరో విద్యుత్ బిల్లు

- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: గృహజ్యోతి పథకంలో భాగంగా జిల్లాలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వినియోగదారులకు మార్చి ఒకటో తేదీ నుంచి జీరో బిల్లు ఇవ్వడం జరుగుతుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు అర్హులని పేర్కొన్నారు. ఇంకా ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పసుపు ధర రూ.14,255



సుభాష్‌నగర్: పసుపు రైతులకు మంచి రోజులు వచ్చాయి. పంటకు అంతర్జాతీయంగా డిమాండ్ పెరగడంతో ధర క్రమక్రమంగా పెరుగుతోంది. తాజాగా బుధవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో అత్యధికంగా క్వింటాలు ధర రూ. 14,255 పలికింది. బాల్కొండ మండలం వన్నెల్-బికి చెందిన పన్నాల రాజేందర్ తీసుకొచ్చిన 16 క్వింటాళ్ల పసుపు కొమ్మునకు క్వింటాలుకు ఈ ధర వచ్చింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధికం. పసుపునకు ఆశించిన ధర వస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశముందని మార్కెట్ వ్యాపార, అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా బుధవారం నిజామాబాద్ మార్కెట్‌లో మరో 42 మంది రైతులకు చెందిన 326 క్వింటాళ్ల పసుపునకు రూ.13వేలకుపైగా ధర వచ్చింది. రూ. 14వేల మార్క్ దాటడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పసుపు ధర పై సీఎం హర్షం

- 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రేవంత్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నిజామాబాద్ మార్కెట్ యార్డులో పసుపు పంటకు క్వింటాలుకు రూ.14 వేల మద్దతు ధర దక్కడంపై సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్)లో పోస్ట్ చేశారు. కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే రైతులకు శాశ్వత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. తక్షణం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు. కాగా నిజామాబాద్ మార్కెట్‌లో బుధవారం పసుపు క్వింటాలుకు గరిష్టంగా రూ.14,255 ధర పలికింది.

దేశ భద్రత మోదీతోనే సాధ్యం



బోధన్‌లో బీజేపీ విజయ సంకల్ప సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్

బోధన్/నందిపేట్/రెంజల్/నవీపేట: ప్రజా సంక్షేమం, దేశ భద్రత, అవినీతి రహిత సమాజం మోదీతోనే సాధ్యమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్ర బుధవారం నందిపేట నుంచి ప్రారంభమై రెంజల్ మండలం సాటాపూర్, జన్నెపల్లి, నవీపేట మీదుగా బోధన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం ముందుకు సాగుతుందన్నారు. మోదీని మూడోసారి ప్రధానిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కేంద్ర నిధుల కోసం ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక శాఖ మంత్రి వద్దకు క్యూకట్టారని వ్యాఖ్యానించారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలన్నదే మోదీ లక్ష్యమన్నారు. గత ఎన్నికల్లో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చి నెరవేర్చానన్నారు. పసుపు ధరకు గిట్టుబాటు ధర కల్పిస్తామని పేర్కొన్నారు. మూతపడిన నిజాంషుగర్ ఫ్యాక్టరీల పునరుద్ధరణ విషయంలో కాంగ్రెస్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. బోధన్ రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా మారుస్తామన్నారు. అనంతరం ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అబద్ధాలని స్పష్టమైందన్నారు. పార్లమెంట్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు భారతి, పాలెం రాజు, లోలపు రజని, మేక విజయ, గోపికృష్ణ, నర్సింహారెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, మేక సంతోష్, సుధాకర్ చారి, శ్రీధర్, రాహుల్, రాంనాథ్, గోపికిషన్ పాల్గొన్నారు.

హామీలు అమలు చేస్తే రాజకీయాలకు దూరంగా ఉంటా

అసెంబ్లీ ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ ఆచరణ సాధ్యం కాని ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేస్తే తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఇందుకోసం రూ. 34 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు. ఆ డబ్బులు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఇతర హామీలను కూడా అమలు చేయలేదన్నారు. పదేళ్ల కేసీఆర్ దొరల పాలనకు వ్యతిరేకంగా బరిగీసీ బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్ అధికారం తన్నుకుపోయిందన్నారు.

ప్రజాదరణ కోల్పోయిన పార్టీ కాంగ్రెస్

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్

పెర్కిట్(ఆర్మూర్): ప్రజల సంక్షేమం కోసం కాకుండా రాజకీయం కోసం మాత్రమే పనిచేసిన కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆదరణ కోల్పోయిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా మామిడిపల్లిలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 60 ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం దేశాన్ని అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. కేవలం పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధిలో ప్రపంచ దేశాల్లో మూడో స్థానానికి తీసుకెళ్తున్నారన్నారు. కాంగ్రెస్ మోసాలను గ్రహించిన ప్రజలు ఎన్నికల్లో పార్లమెంట్ ఎన్నికల్లో తిరస్కరిస్తారన్నారు. అలాగే కాంగ్రెస్ పాలనలో నిస్తేజంగా ఉన్న ఈడీ ప్రస్తుతం తన పని తాను చేసుకుంటూ పోతుందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాగ్దానాలను నిలబెట్టుకోవడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ఆదాయాన్ని మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకే కేటాయించి మిగతా జిల్లాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. తెలంగాణలో రెట్టింపైన వ్యవసాయ పెట్టుబడి వ్యయాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అలాగే కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఒకరినొకరు దూషించుకోవడం తప్పా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి ఎవరు ముందుకు రావడం లేదన్నారు. ప్రధాని మోదీకి ప్రజల్లో ఉన్న విశేష ఆదరణతో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీ రావడం ఖాయమన్నారు. అనంతరం పసుపు రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, విజయ సంకల్ప యాత్ర ఇన్‌చార్జి రాంనాథ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహారెడ్డి, పట్టణాధ్యక్షుడు ద్యాగ ఉదయ్ పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

క్లుప్తంగా

పీజీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో బుధవారం ఒక విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ కుపాల్పడుతూ డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. పీజీ మొదటి సెమిస్టర్, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ పీజీ 7వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో 1,911 మందికి 1,793 మంది హాజరు కాగా 118మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఆర్మూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో ఓ విద్యార్థి మాల్‌ప్రాక్టీస్ పాల్పడుతూ డిబార్ అయినట్లు తెలిపారు.

ఎంఈడీ సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని కొనసాగుతున్న ఎంఈడీ మూడవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 36 మందికి 35 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

బీఐఎస్‌పై అవగాహన అవసరం



సుభాష్‌నగర్: వస్తువుల నాణ్యత, ప్రామాణికత నిర్ధారించే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్)పై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం బీఐఎస్ పనితీరుపై అవగాహన సదస్సు నిర్వహించారు. వస్తువుల నాణ్యతను గుర్తించడం, నకిలీ వస్తువుల గుర్తిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలనే తదితర అంశాలపై బీఐఎస్ సంస్థ సైంటిస్ట్ సరిత అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వస్తువుల నాణ్యత, మన్నికను తెలుసుకునేందుకు బీఐఎస్ ద్వారా నిర్ధారించే అంశాలు ప్రాధాన్యత కలిగి ఉంటాయన్నారు. బీఐఎస్ కేర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. సదస్సులో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఒకరికి నాలుగు రోజుల రిమాండ్

నిజామాబాద్ రూరల్: ఉపాధ్యాయులను తిట్టిన కేసులో మండలంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన నరేంద్రకు జడ్జి కుంచాల సునీత నాలుగు రోజుల రిమాండ్‌ను విధించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహేశ్ పేర్కొన్నారు. మండలంలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన నరేంద్ర కూలీ పని చేస్తు జీవిస్తుంటాడు. బుధవారం మద్యం మత్తులో కుమార్‌గల్లీ ఉన్న పాఠశాలలోకి ప్రవేశించి పిల్లలను, ఉపాధ్యాయులను తిట్టడంతో సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో నాలుగు రోజుల రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల కెరియర్ గైడెన్స్ కోసం టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలోతెలిపారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 18004252428 9 నుంచి 12 తరగతుల విద్యార్థులకు కెరియర్ మార్గదర్శకత్వం, కెరియర్ ఎంపికలు, వివిధ ప్రవేశ పరీక్షల వివరాలు, వాటికి సంబంధించిన సందేహాలు నివృత్తి చేసుకునేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.



పరీక్షా కేంద్రం వద్ద క్యూలో ఉన్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షలు ప్రారంభం



జిల్లాలో ఇంటర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది విద్యార్థులను పరీక్షించి లోపలికి అనుమతించారు. పరీక్ష కేంద్రాలను డీఐఈవో, సంబంధిత అధికారులు పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుడా చర్యలు తీసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

నాలుగేళ్లకోసారి పండుగ!

పుట్టినరోజు.. పెళ్లి రోజు ప్రతి మనిషి జీవితంలో మరిచిపోలేనివి. ఆ రోజును ప్రతి ఏటాది ఘనంగా జరుపుకోవాలనుకుంటారు. కానీ కొందరు తమ బర్త్‌డే, మ్యారేజ్ డేలను నాలుగేళ్లకోసారి జరుపుకొంటారు. లీపు సంవత్సరంలో ఫిబ్రవరి 29న తమ జన్మదినం, వివాహ వార్షికోత్సవాలు ఉండటమే అందుకు కారణం.

అరుదైన రోజు ఒకటిగా..



పెర్కిట్: ఆలూర్‌కు చెందిన గడ్డి మనీష్ చంద్ర, ఆర్మూర్‌కు చెందిన చెందేశీ రాజశ్రీ పెళ్లి నేడు జరగనుంది. నాలుగు సంవత్సరాలకు ఒక సారి వచ్చే అరుదైన రోజున పెళ్లి చేసుకుంటున్నందుకు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు చేస్తా



నిజామాబాద్ సిటీ: నాలుగేళ్లకు ఒకసారి వచ్చే తన పుట్టిన రోజున సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని చెబుతున్నాడు నగరంలోని కోటగల్లికి చెందిన పుప్పాల జ్ఞానేశ్వర్. ఆయన 2004 ఫిబ్రవరి 29న జన్మించాడు. తన రెండు పుట్టిన రోజులను బంధుమిత్రుల మధ్య చేశారన్నాడు.

సంబురంగా పుట్టిన రోజు



ఆర్మూర్: ఆర్మూర్‌లోని పెర్కిట్‌కు చెందిన మంచిర్యాల సురేష్, సంధ్యారాణి వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయులు. వీరి పెద్ద కుమారుడు లలిత్ చంద్ర 2004 ఫిబ్రవరి 29న జన్మించాడు. ఇప్పటి వరకు నాలుగు సార్లు మాత్రమే జన్మదినం జరుపుకున్న ఇతని ఐదో జన్మదినం గురువారం జరపడానికి తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం లలిత్ చంద్ర బీటెక్ రెండో సంవత్సరం చదువుకుంటున్నాడు. లలిత్ చంద్ర తమ్ముడు రుషి చంద్ర 2007 జనవరి 1న జన్మించడంతో తల్లిదండ్రులు ఇద్దరి జన్మదినాలను ప్రత్యేకంగా జరుపుతారు.

ప్రత్యేకతతో సంతోషం



నవీపేట: నవీపేటకు చెందిన మనస్విని, రెంజల్‌కు చెందిన తడక గంగప్రసాద్ నేడు పెళ్లి చేసుకోనున్నారు. ఇంత ప్రత్యేకత ఉన్న రోజున తాము ఒక్కటవుతామని అనుకోలేదన్నారు. పెళ్లి రోజు నాలుగేళ్లకు ఒక సారి జరుపుకోవాల్సి వస్తుందనే చిన్నపాటి బాధ ఉన్నా.. ప్రత్యేక రోజు కావడంతో ఆనందంగా ఉంది.

నాలుగేళ్లకు పుట్టిన రోజు రావడం విభిన్నం



గోగు అక్షయ · బదాల మహన్య · గరిపల్లి మహన్విత్‌గౌడ్

సిరికొండ: చిన్నవాల్గోట్ గ్రామానికి చెందిన గోగు మోహన్‌రెడ్డి–లత దంపతుల రెండో సంతానం అక్షయ. ఈమె 2008 ఫిబ్రవరి 29న జన్మించింది. ప్రస్తుతం అక్షయ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. అదే గ్రామానికి చెందిన బదాల రాజేందర్–జ్యోతిల కూతురు 2020లో ఫిబ్రవరి 29న జన్మించింది. నేడు మొదటి పుట్టిన రోజు జరుపుకోనుంది. భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ గ్రామానికి చెందిన గరిపల్లి లక్షిత– అనీష్‌గౌడ్‌ల కుమారుడు మహన్విత్‌గౌడ్ 2020లో ఫిబ్రవరి 29న జన్మించాడు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు



దర్పల్లి: జిల్లాలో యూరియా కొరత లేదని, ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ హెచ్చరించారు. ఆయన మంగళవారం మండలంలోని మైలారంలో పంటలను పరిశీలించారు. వ్యవసాయ విస్తీర్ణాధికారులు చేపట్టిన పంటల వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పంటల వివరాలను పకడ్బందీగా తెలుసుకొని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని అధికారులకు సూచించారు. రైతులు మోతాదుకు మించి యూరియాను వాడకూడదని సూచించారు. కార్యక్రమంలో ఏవో ప్రవీణ్, ఏఈవో మనోజ్ పాల్గొన్నారు.

నేర విచారణ సమర్థవంతంగా ఉండాలి

కామారెడ్డి క్రైం : నేర విచారణ మరింత సమర్థవంతంగా చేపట్టడంతో పాటు పెండింగ్ కేసులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సింధు శర్మ అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నేర స్వభావం కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పోక్సో యాక్ట్ కేసుల్లో విచారణలో వేగం పెంచాలన్నారు. జిల్లాలో మిస్సింగ్ అయిన మహిళలు, చిన్న పిల్లలు కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే గుర్తించాలన్నారు. గుట్కా, గంజాయి, పేకాట, అక్రమ ఇసుక రవాణా లాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధిక వడ్డీలు వసూలు చేసుతన్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు, వాహన తనిఖీలు నిర్వహించాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు.

అవార్డుల అందజేత..

విధుల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పోలీసులకు నేర సమీక్ష అనంతరం ఎస్పీ సింధు శర్మ అవార్డులను అందజేశారు. అవార్డులు పొందిన వారిలో ఏవో అఫ్సర్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవీందర్ సింగ్, జూనియర్ అసిస్టెంట్ శివ, ఎస్సై ఉస్మాన్, ఏఎస్సైలు ప్రభాకర్ రెడ్డి, రాజేశ్వర్, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సాయాగౌడ్, రవికుమార్, మురళి, జి సాయన్న, విక్రమ్ రెడ్డి, కానిస్టేబుళ్ళు కరుణాకర్, విశ్వనాథం, ఎం.రాజు, రాజు, బుచ్చయ్య, గంగాధర్, అశోక్, హెడ్‌కానిస్టేబుల్, సంజీవులు, రవీందర్, సంజీవ్, గణేష్, నర్సింలు, రాములు ఉన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈ రాంసింగ్ సస్పెన్షన్

- ఆరోపణలు రుజువు కావడంతో సీఎండీ ఆదేశాలు
- వెలుగులోకి వస్తున్న మరిన్ని అక్రమాలు

నిజామాబాద్‌నాగారం: ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు దండుకొని మోసం చేసిన నగరంలోని డి–5 సెక్షన్ ఏఈ రాంసింగ్ సస్పెన్షన్‌కు గురయ్యారు. వరంగల్ టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఏఈ రాంసింగ్‌ను సస్పెన్షన్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే జిల్లాలో నవీపేట్ ఏడీఈ సుహాసిని, డీఈ శ్రీనివాస్‌రావులు నిరుద్యోగులను మోసం చేసిన విషయంలో వచ్చిన ఫిర్యాదుపై ముందస్తుగా విచారణ చేపట్టి ఆ నివేదికను ఎస్‌ఈ రవీందర్‌కు అందజేశారు. నెల రోజుల క్రితం ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కావడం లేదంటూ పత్రికల్లో కథనాలు రావడంతో విజిలెన్సు డీఈ ప్రభాకర్‌తో విచారణ చేయించారు. దీంతో ఏపీటీఎస్ సీఐ గోవర్ధన్ ఆధ్వర్యంలో సైతం విచారణ చేపట్టారు. నవీపేటర్ మండలంలో 2016–17లో ఏఈగా విధులు నిర్వహించిన సమయంలో రాంసింగ్ నిరుద్యోగులకు సబ్‌స్టేషన్ ఆపరేటర్ ఉద్యోగాలు కల్పిస్తానని లక్షలాది రూపాయలు దండుకున్నాడు. నిరుద్యోగులు ఎనిమిదేళ్లుగా నిరీక్షించినా ఉద్యోగం కల్పించకపోవడం, నగదు ఇవ్వకపోవడంతో బాధితులు ఎస్‌ఈ రవీందర్, డీఈ, ఏడీఈలతో పాటు సీఎండీకి ఫిర్యాదులు చేశారు. ఈ నెల 26న నవీపేట్ మండల కేంద్రానికి వెళ్లి బాధితుల ఫిర్యాదు మేరకు విజిలెన్సు డీఈ, ఏపీటీఎస్ సీఐలు వేర్వేరుగా విచారణ చేపట్టి నివేదికను ఎస్‌ఈ ద్వారా సీఎండీకి అందజేశారు. బాధితులు జరిగిన వాస్తవాన్ని చెప్పడంతో పాటు రూ. లక్షలు దండుకున్న విషయాన్ని ఆధారాలతో విచారణ అధికారులకు అందజేశారు. సమగ్రంగా విచారణ చేపట్టి నివేదిక ఆధారంగా సీఎండీ వరుణ్‌రెడ్డి సదరు ఏఈని సస్పెండ్‌చేశారు.

కదులుతున్న అక్రమాల డొంక..

నగరంలోని డి–5 సెక్షన్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న రాంసింగ్ అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. నవీపేట్ మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు బాధితులు ఫిర్యాదు చేయడంతో విజిలెన్సు డీఈ ప్రభాకర్ బుధవారం విచారణ చేపట్టారు. నవీపేట్ మండలం తోపాటు, కామారెడ్డి జిల్లాలో బాధితులు ఉన్నట్లు సమాచారం. ఏఈ సస్పెండ్‌కావడంతో బాధితులు బయటకు వస్తున్నారు. కొంతమంది ఇన్ని రోజులు అతని బయానికి బయటకు రాలేదు. త్వరలోనే మరింత బాధితులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఉన్నతాధికారులు డి5 ఏఈగా ఇన్‌చార్జి బాధ్యతలను సుభాష్‌నగర్ ఏఈ గంగాశేఖర్‌కు అప్పగించింది.

గుత్ప ఎత్తిపోతల పనుల్లో నిర్లక్ష్యం తగదు

- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి
- రైతులతో కలిసి పనుల పరిశీలన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మాక్లూర్: గుత్ప ఎత్తిపోతల పనుల్లో నిర్లక్ష్యం తగదని సంబంధిత అధికారులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశించారు. మండలంలోని గుత్ప గ్రామంలో చేపడుతున్న గుత్ప ఎత్తిపోతల పథకం పనులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పార్టీ సీనియర్ నాయకుడు శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దటూరి వినయ్‌రెడ్డి, పది గ్రామాల రైతులతో కలిసి బుధవారం పరిశీలించారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారం కోసం బీఆర్ఎస్ హాయంలో ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ఎత్తిపోతల పథకం పనుల్లో పూర్తికాకపోవడంలో ఆంతర్యమేమిటని మేజర్ ఇరిగేషన్ ఈఈ భానుప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. రైల్వేపట్టాల వద్ద పనులు చేపట్టడానికి అనుమతికై జాప్యం జరిగిందన్నారు. జూన్ నాటికి ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోనికి తేవాలని ఎమ్మెల్యే ఈఈని ఆదేశించారు. నత్తనడకన సాగుతున్న ఎత్తిపోతల పనుల విషయమై ఎమ్మెల్యే స్పందించటంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు, గ్రామస్తులు ఉన్నారు.

బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకం..

డిచ్‌పల్లి: బీసీ కులగణనకు బీజేపీ వ్యతిరేకమని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఖిల్లా డిచ్‌పల్లి సహకార సొసైటీ చైర్మన్‌గా యానంపల్లికి చెందిన ఎం.రాంచందర్ గౌడ్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు మద్దతు ధర కల్పించడానికి గతంలోని ఎజెండాలో పెట్టామని దానికి చట్టబద్ధత కల్పిస్తామన్నారు. పసుపు బోర్డు తెస్తానని ఎంపీ అర్వింద్ పేపర్ మీద ప్రకటించారని కానీ నేటి వరకు అతిగతి లేదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే రైతులకు న్యాయం జరుగుతుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒకటేనని ఆరోపించారు. అంతకు ముందు డీసీవో కార్యాలయ అధికారి బుచ్చన్న నూతన చైర్మన్ రాంచందర్‌గౌడ్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే చైర్మన్‌ను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు శేఖర్ గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, ధర్మగౌడ్, సొసైటీ డైరెక్టర్లు, వైస్ చైర్మన్ కుమ్మరి చిన్నగంగారాం, సొసైటీ సీఈవో కిషన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, నాయకులు కంచెట్టి గంగాధర్, పొలసాని శ్రీనివాస్, బూస సుదర్శన్, ఏజీ దాస్, డాక్టర్ షాదుల్లా, న్యాస రాజేశ్వర్, ఎంపీటీసీ నర్సయ్య, నాయకులు, కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

కుమారుడిని వదిలి.. మహిళ అదృశ్యం

- ఆత్మహత్య చేసుకుని ఉంటుందని అనుమానం
- నిజాంసాగర్ ప్రధాన కాలువ వద్ద గాలింపు



ఏడుస్తున్న యోగేశ్



కుమారుడు, భర్తతో శిరీష(ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): ''అమ్మా నేను బస్సెక్కి వస్తున్నా.. బాన్సువాడ బస్టాండ్‌కు వచ్చి ఉండమ్మా'' అంటూ కన్న తల్లికి ఫోన్ చేసి చెప్పిన కూతురు.. బాన్సువాడ చేర లేదు. మార్గమధ్యలో బ స్సు దిగి ఏడాది వయసున్న కుమారుడిని రోడ్డు పక్కన వదిలి మాయమైంది. నిజాంసాగర్ ప్రధాన కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలం గండిమాసానిపేట గ్రామానికి చెందిన ఆందోల్ శిరీష(25) ఏడాది వయసున్న కుమారుడు యోగేష్‌తో కలిసి బుధవారం తాడ్కోల్‌లోని తన పుట్టింటికి వెళ్లడానికి బయలుదేరింది. శిరీషను అమె భర్త సతీష్ ఎల్లారెడ్డి బస్టాండ్‌లో బస్సు ఎక్కించాడు. అయితే శిరీష బాన్సువాడకు కాకుండా మధ్యలో ఉన్న మహమ్మద్ నగర్ మండలంలోని గాలిపూర్ స్టేజ్ వరకు మాత్రమే టికెట్టు తీసుకుంది. అక్కడ బస్సు దిగి ప్రధాన రహదారి పక్కనే ఉన్న నిజాంసాగర్ ప్రధాన కట్ట వద్దకు వెళ్లింది. కాలువ కట్ట వద్ద చెట్టు కింద కుమారుడిని కూర్చోబెట్టి, హ్యాండ్ బ్యాగ్, ఆధార్ కార్డు, బస్సు టికెట్టు అక్కడే ఉంచి మాయమైంది. ఆమె కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుని ఉంటుందని భావిస్తున్నారు. అనంతరం బాలుడు తల్లి కోసం ఏడుస్తూ రోడ్డుపైకి రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆధార్ కార్డు ఆధారంగా శిరీష భర్త సతీశ్‌కు, ఆమె తల్లి లక్ష్మికి సమాచారం ఇచ్చారు. పోలీసులు నిజాంసాగర్‌నుంచి నీటి విడుదల కొనసాగుతుండడంతో కాలువలో గాలించడం సాధ్యపడలేదు. దీంతో పోలీసులు నీటి పారుదలశాఖ అధికారులతో మాట్లాడి నీటి విడుదలను నిలిపివేయించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు శిరీష కోసం ప్రధాన కాలువ వెంట గాలించినా ఆచూకీ లభించలేదు. అల్లుడు సతీశ్ వేధింపుల కారణంగా తన కూతురు ఆత్మహత్య చేసుకుని ఉంటుందని శిరీష తల్లి లక్ష్మి ఆరోపించింది. కాగా వారం క్రితమే శిరీష, సతీశ్ దంపతులు తమ కుమారుడి మొదటి పుట్టిన రోజు జరుపుకున్నారు. అంతలోనే శిరీష కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు మనోవేదనకు గురవుతున్నారు.

క్రైం కార్నర్

దుబాయిలో బాల్కొండ వాసి మృతి



మల్లయ్య (ఫైల్)

బాల్కొండ: మండల కేంద్రానికి చెందిన ఈర్ల మల్లయ్య(62) దుబాయిలో గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం బతుకు దెరువు కోసం దుబాయి వెళ్లిన మల్లయ్య నాలుగు రోజుల క్రితం గదిలో ఉండగానే గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపినట్లు పేర్కొన్నారు. మృతదేహం స్వగ్రామానికి తరలించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

రైల్వే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి

ఖలీల్‌వాడి: వేసవికాలంలో రైలులో ప్రయాణించేవారు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని రైల్వేఎస్సై సాయిరెడ్డి బుధవారం సూచించారు. వేసవికాలంలో ప్రయాణికులు రైలులో కిటికీల వద్ద కూర్చున్నపుడు ప్రయాణికుల మెడలోని బంగారు చైన్‌లు ఇతరులకు కనిపించే విధంగా ఉంచరాదన్నారు. ప్రయాణంలో దొంగతనాలు ఎక్కువగా పెరిగే అవకాశాలు ఉన్నందున బ్యాగులో విలువైన బంగారు వస్తువులు, డబ్బులు ఉంచరాదని, సెల్‌ఫోన్‌లు చార్జింగ్ పెట్టి పడుకోరాదని సూచించారు. రైలు ఆగి కదులుతున్న సమయంలో వాష్ రూమ్‌ల వద్ద ఉండరాదన్నారు. మహిళలను ఎవరైనా ఇబ్బంది పెట్టినా, వస్తువులు పోయినా వెంటనే డయల్ 139కు ఫిర్యాదు చేయాలన్నారు.

బట్టలు ఉతకడానికి వెళ్లి మృత్యువాత

మాచారెడ్డి: బట్టలు ఉతకడానికి వెళ్లి ప్రమాదవశాత్తు ఒకరు నీటమునిగి మృతి చెందిన ఘటన పాల్వంచ మండలం ఫరీదుపేటలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిరుదొడ్డి అనిల్(30) బుధవారం గ్రామానికి చెందిన మరో ఇద్దరితో కలిసి చెరువులో బట్టలు ఉతకడానికి వెళ్లారు. స్నానం చేయడానికి చెరువులోకి దిగిన అనిల్ ఈత కొడుతూ ప్రమాదవశాత్తు నీట మునిగి మృతిచెందాడు. గమనించిన ఇద్దరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రామారెడ్డి: మండలంలోని ఉప్పల్‌వాయికి చెందిన నవీన్ (23) ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విజయ్‌కొండ బుధవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నవీన్ వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. తన తల్లి నాగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. నాటి నుంచి తల్లిని గుర్తుకు చేసుకుంటూ బాధపడేవాడని కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. మంగళవారం రాత్రి తండ్రి వ్యవసాయ పొలానికి వెళ్లగానే ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

నవీపేట: మండల కేంద్రంలోని నెహ్రూరోడ్డులో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో ఇద్దరు గుర్తు తెలియని దుండగులు బుధవారం వేకువజామున చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం రూంలోకి చొరబడి ఏటీఎం బాక్స్‌ను ధ్వంసం చేశారు. ఆధునిక టెక్నాలజీతో ఇంటర్నెట్‌ను అనుసంధానించడంతో ముంబాయిలోని ప్రధాన ఎస్‌బీఐ కార్యాలయంలో సైరన్ మోగింది. దీంతో అప్రమత్తమైన బ్యాంక్ అధికారులు స్థానిక పీఎస్‌కు వెంటనే ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు అక్కడికి చేరుకునులోపే అనుమానం వచ్చిన దుండగులు పారిపోయారు. రంగంలోకి దిగిన క్లూస్‌టీమ్ దుండగుల వేలిముద్రలను స్వీకరించింది. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సతీశ్, ఎస్సై యాదగిరిగౌడ్ ఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి

- బాల్కొండలో ఉరేసుకొని ఆత్మహత్య
- భర్త, అత్త, మామలే చంపారంటూ బంధువుల ఆరోపణ



లావణ్య (ఫైల్)

బాల్కొండ: అత్తింటి వేధింపులకు వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ధర్మాయి లావణ్య(32)కు అదే గ్రామానికి చెందిన రాజేందర్‌తో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. కుమారుడు జన్మించిన నాటి నుంచి భర్త, అత్త, మామలు వరకట్న వేధింపుల కోసం ఇబ్బందులు పెట్టేవారు. ఈ క్రమంలో వీరి వేధింపులు ఎక్కువ కావడంతో మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లావణ్య తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భర్త, అత్త, మామలు పోలీసు అదుపులో ఉన్నట్లు తెలిపారు.

పీఎస్ ఎదుట ఆందోళన

లావణ్యను భర్త రాజేందర్, అత్త లక్ష్మీబాయి, మామ పెద్దన్నలు కలిసి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించరంటు మృతురాలి బంధువులు బాల్కొండ పీఎస్ ఎదుట ఆందోళన చేపట్టారు. కొంత కాలంగా కోర్టులో కేసు ఉండగా గురువారం విచారణ ఉందని గమనించి మంగళవారం రాత్రి చంపేశారంటు ఆరోపించారు. పదేళ్లుగా చిత్రహింసాలు పెట్టారని విలపించారు. నిందితులను తమకు అప్పగించాలంటూ నినాదాలు చేశారు. నిందితులకు శిక్షపడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కుల పెద్దలు, పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

చెట్టును ఢీకొన్న బైక్

- ఇద్దరి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు



కేతావత్ సవైసింగ్, కేతావత్ కిషన్(ఫైల్)

పిట్లం: బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని పిట్లం–బాన్సువాడ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. సిద్ధాపూర్ తండాకు చెందిన హలావత్ సుభాష్, కేతావత్ కిషన్, కుమారుడు కార్తీక్, కేతావత్ సవైసింగ్‌లు మండలంలోని రూమ్ తండాలో నిర్వహించిన సుభాష్ చెల్లిలి వివాహానికి మంగళవారం వెళ్లారు. వీరు అర్ధరాత్రి 2 గంటల సమయంలో నలుగురు ఒకే బైక్‌పై తిరిగి వస్తుండగా అన్నారం గేట్ సమీపంలోని పిట్లం–బాన్సువాడ రహదారిపై బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్నది. ఈ ఘటనలో కేతావత్ సవైసింగ్ (45) అక్కడికక్కడే మృతి చెందగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కేతావత్ కిషన్(36) మృతి చెందారు. తీవ్రంగా గాయాలపాలైన సుభాష్‌కు మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించగా కార్తీక్ స్వల్పగాయాలయ్యాయి. సవైసింగ్ తమ్ముడు దేవీసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.